క్లుప్తంగా

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ పోటీలు



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు

ఆకివీడు: స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీల ప్రారంభోత్సవం శుక్రవారం మండలంలోని సిద్ధాపురం గ్రామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రారంభమయ్యాయి. మండల స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల నుంచి అండర్–14, 17 విభాగాల్లో పోటీ చేసేందుకు సుమారు 600 మంది విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా హాజరయ్యారు. మొదటి రోజు పోటీల్లో కబడీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

అగ్ని ప్రమాద బాధితుడికి వంటసామగ్రి అందజేత

భీమవరం అర్బన్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలోనే ఆనందం ఉంటుందని రెడ్‌క్రాస్ సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళీకృష్ణారావు, కో ఆర్డినేటర్ ఎస్. మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో వృద్ధుడు కొప్పు వెంకట్రావు నివసిస్తున్న రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. దీంతో జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ మంతెన శివరామ బద్రి రాజు ఆదేశాలు మేరకు సిబ్బంది శుక్రవారం వంట సామగ్రి, హైజిన్ కిట్, టార్పాలిన్ అందజేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడికి గాయాలు

ఉండి: మండలంలోని ఉప్పులూరులో ద్విచక్ర వాహనం ఢీకొని తొమ్మిదేళ్ల బాలుడు గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పులూరులో కొత్త చర్చి వద్ద శుక్రవారం కొల్లి రక్షణబాబు (9)ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బాలుడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో బాలుడిని భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు బాలుడి తండ్రి నానిబాబు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హామీల అమలు ఎప్పుడు?



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: సూపర్ 6 పథకాలతో ప్రజలను బురిడి కొట్టించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 100 రోజుల పాలనలో ప్రజలకు ఏ విధమైన సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోయారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి 100 రోజుల పాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేయడం తప్ప ప్రజలకు ఏ విధంగానూ ప్రయోజనం చేకూర్చలేకపోయారని దుయ్యబట్టారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేశారని మండిపడ్డారు.

రైతులకు వ్యవసాయ కిట్ల పంపిణీ



అరట్లకట్టలో రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రకృతి సేద్యం ద్వారా లభించే ఆహార ఉత్పత్తులతో మంచి ఆరోగ్యం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి వై.నూకరాజు అన్నారు. పాలకొల్లు మండలం అరట్లకట్ట సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. పురుగుమందులు వాడకుండా స్థానికంగా లభ్యమయ్యే వివిధ రకాల ఆకులు, పదార్థాలతో కషాయాలు తయారు చేసుకుని పంటలకు వినియోగించవచ్చన్నారు. అనంతరం రైతులకు వ్యవసాయ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, డివిజన్ ఇన్‌చార్జ్ అప్పారావు, మోడల్ టీం లీడర్ మురళీకృష్ణ, ఎంటీ నాగరాజు పాల్గొన్నారు.

సబ్బేవారిపేటలో పోషకాహార అవగాహన ర్యాలీ

పాలకొల్లు అర్బన్: మండలంలోని సబ్బేవారిపేటలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి సూచించారు. దీని వల్ల రక్తహీనత సమస్యలు తగ్గుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఒడూరి పద్మ, ఎల్.విజయకుమారి, కె.దుర్గ, డి.ప్రసన్న, ఎ.పల్లవి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం ఎక్కడ?

- అధికారంలోకి వస్తే డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తామని పవన్ కల్యాణ్ హామీ
- అధికారంలోకి వచ్చాక అసలు పట్టించుకోని వైనం



భీమవరం యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై వేస్తున్న చెత్త

భీమవరం: పట్టణంలో చెత్త సమస్యను పరిష్కరించడానికి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయిస్తామంటూ ఎన్నికల్లో భారీప్రచారం చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టాక డంపింగ్‌యార్డు మాటను మర్చిపోయారా అంటూ పట్టణ ప్రజలు వ్యంగంగా మాట్లాడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఇది మంచి ప్రభుత్వం అంటూ చేస్తున్న హడావుడితో భీమవరంలో డంపింగ్‌యార్డు సమస్యను ప్రస్తావిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో పవన్‌కల్యాణ్ భీమవరం ఎప్పుడు వచ్చినా డంపింగ్ యార్డు సమస్యను లేవనెత్తడమేగాక తాము అధికారంలోనికి వస్తే తక్షణమే సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇవ్వడమే గాక అప్పటి ఎమ్మెల్యేపై విమర్శనాస్త్రాలు సంధించడం పరిపాటిగా మారిది. 2024 ఎన్నికల ప్రచారంలో కూడా పవన్‌కల్యాణ్ భీమవరం పట్టణంలో డంపింగ్‌యార్డు సమస్యను ప్రధానంగా ప్రస్తావించారు. భీమవరం పట్టణంలో డంపింగ్‌యార్డు సమస్య ఎప్పటినుంచో పరిష్కారానికి నోచుకోవడం లేదు.

80 మెట్రిక్ టన్నుల చెత్త

పట్టణంలోని 39 వార్డులకుగాను నిత్యం సుమారు 80 మెట్రిక్‌టన్నుల చెత్తనుసేకరిస్తారు. దీనిని పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై వేస్తుంటారు. ఎంతో కాలంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో చాలా వరకు యనమదుర్రు డ్రెయిన్ పూడిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా అప్పటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని పరిశీలించగా అప్పటి ప్రతిపక్షనాయకులు అడ్డుకున్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పట్టణానికి ఒక గ్రామంలో స్థల సేకరణ కు సిద్ధం కాగా ఆ గ్రామ ప్రజలు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయింది. చివరకు భీమవరం మండ లం తాడేరు గ్రామంలో సుమారు 6 ఎకరాల భూమి ని సేకరించారు. అక్కడికి చెత్తను తరలించే వాహనాలు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాల్సిన సమయంలో ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయా యి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచిపోయినా స్థానిక ఎమ్మెల్యే పులపర్తిరామాంజనేయులు(అంజిబాబు) డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో చెత్తను ఎప్పటి మాదిరిగా యనమదుర్రు డ్రెయిన్ గట్టుపైనే వేస్తున్నారు.

మొక్కలతోనే పర్యావరణ భవిష్యత్



మొక్కలు నాటుతున్న సర్పంచ్ నందమూరి ప్రకాశం

ఆకివీడు: కాలుష్యంతో వాతావరణం నిండిపోతున్న నేటి తరుణంలో మొక్కలే భవిష్యత్‌లో పర్యావరణాన్ని కాపాడతాయని సర్పంచ్ నందమూరి ప్రకాశం చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమం నాల్గో రోజు అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకుమిల్లి గ్రామంలో మొక్క నాటిన సర్పంచ్ నందమూరి ప్రకాశం మాట్లాడుతూ అమ్మ మనకి జన్మనిచ్చినట్లుగానే, భవిష్యత్‌లో మొక్కలు మన ప్రాణాలను కాపాడి మరో జన్మనిస్తాయన్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఆశ, ఏఎన్‌ఎంలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన



మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులపై పరిశీలన చేస్తున్న ఈఈ దుర్గేష్

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రతిపాదించిన వివిధ ఆధునికీకరణ, అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించే క్రమంలో శుక్రవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గేష్ కుమార్ (కాకినాడ) శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని పరిశీలించారు. అమ్మవారి దేవస్థానానికి సంబంధించిన పార్కింగ్, లడ్డూ ప్రసాదాలు తయారీ కేంద్రం, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి, దేవస్థానం నూతన పెయింటింగ్ తదితర పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయమై సమగ్ర పరిశీలన అనంతరం ప్లాన్‌లు తయారు చేయిస్తామని ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మీనగేష్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, శ్రీ సుబ్బారాయుడు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి కాకినాడకు చెందిన కె.సత్య శ్రీనివాసరెడ్డి 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టడంపై హర్షం

భీమవరం (ప్రకాశం చౌక్): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజుగా నామకరణం చేయడం పట్ల అల్లూరి సీతారామరాజు యువజన సమాఖ్య, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసయ్య అగ్రహారంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద యువజన సమాఖ్య ఆధ్వర్యంలో హర్షం ప్రకటిస్తూ అల్లూరికి ఘన నివాళులర్పించారు. సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు, ఎస్.సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



కలెక్టర్ నాగరాణికి విరాళం అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆచంట నియోజకవర్గం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అపుస్మా పాఠశాలు) విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేనేజ్మెంట్ సేకరించిన విరాళం రూ.3,50,000 ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేసేందుకు శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిసి డిమాండ్ డ్రాఫ్ట్ ను అందజేశారు. ఈ సందర్భంలో ఆచంట ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. ఆచంట నియోజకవర్గ ప్రెసిడెంట్ జి.రవికుమార్, సెక్రటరీ కె.రవికుమార్, ట్రెజరర్ ఏం.రమేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు పి.వెంకట రెడ్డి పాల్గొన్నారు. అలాగే భీమవరం ఆక్వా ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి రూ.3 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ బహుజన సమైక్య అధ్యక్షులు, సభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి రూ.25,616 చెక్కును అందించారు. సమాఖ్య ఫౌండర్ అండ్ ఛైర్మన్ సోడదాసీ గంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుడిసె అనిల్ కుమార్, కోశాధికారి గుర్రం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల విరాళం

కాళ్ల: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు చిన్నారులు సైతం ముందుకు రావడం అభినందనీయమని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. విద్యార్థులు సేకరించిన రూ.2,74,813 డీడీని ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాట్ల విజయకుమారి, శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు సాయం

భీమవరం: నిరాధరణకు గురైన భీమవరం పట్టణంలోని 15వ వార్డుకు చెందిన వృద్ధ దంపతులు డోకల నాగన్న, అప్పాయమ్మలకు శుక్రవారం మానవత సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ బియ్యం, నిత్యవసరాలు, వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బుద్దరాజు వెంకటపతిరాజు, కార్యదర్శి వేమూరి రాంబాబు, కో–చైర్మన్ కారుమూరి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యూపీఏ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం రూరల్ ఇన్‌చార్జి సీఐ కాళీ చరణ్

పాలకోడేరు: నాగరికత అభివృద్ధిలో చర్చిల పాత్ర కీలకమని భీమవరం రూరల్ ఇంచార్జి సీఐ జి.కాళీ చరణ్ ఉద్బోధించారు. మండలంలోని మో గల్లులో శుక్రవారం యునైటెడ్ పాస్టర్ల అసోసియేషన్ (యూపీఏ)సర్వసభ్య సమావేశం గోపే సాల్మన్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమవరం రూరల్ ఇంచార్జ్ సిఐ కాళీ చరణ్ పాల్గొని మాట్లాడుతూ పాస్టర్లు నెలకోసారి సమావేశమై సేవా కార్యక్రమాలను నిర్దేశించుకోవడం అభినందనీయమన్నారు. ఎస్సై ఎస్ హరిబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. తొలుత విశాఖపట్నానికి చెందిన రెవరాండ్ పి.అనిల్ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఆకుల దానియేలు, ఎ.శ్యాంబాబు, విజయ్‌కుమార్, జాన్‌బాబు, జి.శౌరి, సాదే గ్రేస్ సుజాత, ఎలీషా, బూసి జయప్రసాద్, గోపే జయ, ఏసురత్నం, అబ్రహాం, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ సాంబశివరాజు దంపతులు

ఉండి: ఒక విద్యార్థికి సహాయం చేస్తే అది ఒక్కరికి మాత్రమే చేసిన సహాయం కాదని రాబోయే తరాలను మార్చేదిగా ఉంటుందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శుక్రవారం ఉండిలో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు దంపతులు, సూర్యకుమారి, వేగేశ్న మహేష్, నీలిమ, పెన్మత్స దిలీప్, సింధు, వేగేశ్న అనంతలక్ష్మి సంయుక్తంగా నపేద విద్యార్థి వాడపల్లి అభినయవర్మ చదవు నిమిత్తం రూ.58 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరాజు మాట్లాడుతూ దాతల సహాయాన్ని వినియోగించుకొని పట్టుదలతో చదవాలనన్నారు. కార్యక్రమంలో రుద్రరాజు నరసరాజు, గాదిరాజు రంగరాజు, బుద్దరాజు సుబ్బరాజు, బి.హరనాథరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, కలిదిండి సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

భీమవరం: హైదరాబాద్ స్టార్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ నెల 22న మల్టీస్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి డీజీఎం కె.సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువ్వలపాలెం రోడ్డులోని ఆనంద్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: ప్రజా సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యతనిస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం పాములపర్రు పంట కాలువ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలువలు ఆక్రమణకు గురి కావడం వల్లనే చెత్త కుప్పలుగా పేరుకుపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉప్పుటేరుపై కోపల్లె డ్రెయిన్‌పైనా స్లూయిజ్ పనులకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈవోపీఆర్డీ రామకృష్ణారెడ్డి, కార్యదర్శి కె.గోపాలకృష్ణ, సర్పంచ్ సౌజన్య బెనర్జీ, ఎంపీటీసీ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు నాలుగు సీట్లు కేటాయించాలి



భీమవరంలో ఆర్టీసీ రీజనల్‌మేనేజర్ వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: సీనియర్ సిటిజన్లకు ఆర్‌టీసీ బస్సుల్లో ప్రత్యేంగా నాలుగు సీట్లు కేటాయించాలని, ఇతర గుర్తింపు కార్డులతో పాటు సీనియర్ సిటిజన్స్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన కార్డును కూడా అనుమతించాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వరప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సహ కార్యదర్శి మట్లపూడి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి బోనం పాండురంగారావు మాట్లాడుతూ ఆర్టీసీ బసుల్లో వృద్ధులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చొనేలా చర్యలు తీసుకోవాలని కండక్టర్లకు ఆదేశాలివ్వాలని, సీట్లు కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామకృష్ణంరాజు, కార్యదర్శి తాళ్ళపూడి గాంధీ, కోశాధికారి కట్రెడ్డి సత్యనారాయణ, వినుకొండ పాండురంగారావు, బీపీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ప్రయత్నాలు కొనసాగిస్తే మాలల సత్తా చూపిస్తాం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరణ ప్రయత్నాలు కొనసాగిస్తే మాలల సత్తా చూపిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. పట్టణంలోని అంబేడ్కర్ హాల్‌లో శుక్రవారం మాల సంఘాల జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బేతాళ శరత్ బాబు అధ్యక్షత వహించారు. మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఎస్సీల మధ్య చిచ్చుపెట్టి, లబ్ధి పొందాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు శాతం 25 వరకు పెంచడానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని మంగరాజు పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరారు. టి.ప్రాన్సిస్, కాంతారావు, జయరాజు, శ్యామ్ ప్రకాష్, రవి దేవాజి, సత్యకృష్ణ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నారాయణరెడ్డి

కాళ్ల: మండలం పరిధిలో 22ఎ నుంచి తొలగించిన ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ (ఫ్రీ హోల్డ్) అసైన్డ్ భూమి, షరతులు గల పట్టాలు, ఈనాం భూములకు సంబంధించి దస్త్రాలను తాడేపల్లిగూడెం ఆర్డీవో బి.నారాయణరెడ్డి పరిశీలించారు. ఈయనను ఈ పరిశీలనకు ప్రత్యేకాధికారిగా నియమించడంతో శుక్రవారం కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, వీఆర్వోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి, దస్త్రాలను పరిశీలించారు. భూములకు సంబంధించి వివరాలను రైతుల వారీగా పూర్తి చేయలన్నారు. మరోసారి వచ్చి భూమి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్లు అధికారులకు తెలిపారని ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున తెలిపారు. సమావేశంలో ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ సిబ్బందికి సత్కారం



భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఆర్పీఎఫ్ సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రయాణికుల రక్షణలో, భద్రతలో రైల్వే భద్రత దళాలు చిత్తశుద్ధితో పని చేస్తాయని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆర్‌పీఎఫ్ సీఐ షేక్ దస్తగిరి అన్నారు. రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక, టౌన్ ఆర్‌పీఎఫ్ సంయుక్త అధ్వర్యంలో టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఆర్‌పీఎఫ్ సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానం చేరే వరకు వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను దొంగాల బారి నుంచి రక్షణ కల్పించడంతోపాటు కదిలే రైలు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురయ్యే ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. అనంతరం 13 మంది ఆర్‌పీఎఫ్ సిబ్బందిని సత్కరించారు. ఏఎస్సై ఎస్ వెంకటేశ్వర్లు, కె.రఘురామయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ఎ.వీరయ్య, చంద్రశేఖర్, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

కాళ్ల: ఏలూరుపాడు గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. ఏలూరుపాడులో సచివాలయ భవనం, రెండు బ్రిడ్జీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, మాజీ సర్పంచ్ మంతెన ఆంజనేయరాజు, వక్కపట్ల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సిద్ధాంతం శ్మశానవాటిక



సిద్ధాంతం శ్మశాన వాటికలో పెరిగిన తుప్పలను చూపుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: దక్షిణ కాశీగా పేరుగాంచిన సిద్ధాంతం శ్మశానవాటిక పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని సీపీఎం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధాంతం శ్మశాన వాటిక డంపింగ్ యార్డుగా మారిందన్నారు. పందులు, కుక్కలకు నిలయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు జరిగే సమయంలో కనీసం నిలుచోవడానికి సైతం చోటు లేకుండా అపరిశుభ్రంగా ఉందన్నారు. శ్మశానం అంతా పిచ్చిమొక్కలు మొలిచి చిట్టడవిలా ఉందన్నారు. దీంతో అఖరి మజిలీకీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆలయ ఆస్తులు, ఇసుక రేవు టోల్‌గేట్ ద్వారా వచ్చిన ఆదాయం లక్షలాది రూపాయలు ఉన్నా అభివృద్ధి చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. త్వరగా అభివృద్ధి చర్యలు చేపట్టకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యా ప్రమాణమే దేశ ప్రగతికి నాంది

పాలకోడేరు: విద్యా ప్రమాణంతోనే దేశ ప్రగతికి నాంది అని, మేధావులు కృషితోనే దేశంలో ఎన్నో పరిశ్రమలు ముందుకు వస్తున్నాయని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్స్ శాస్త్రవేత్త ఈసీఐఎల్ వ్యవస్థాపకులు ఏఎస్ రావు 110వ జయంతిని పురష్కరించుకొని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు త్రినాథులు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు 50 పాఠశాలల్లో ఆట స్థలాలకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎస్ఆర్‌కేఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణంరాజు, ఈసీఐఎల్ రిటైర్డ్ డీజీఎం విశ్వనాథ్ జగదీష్, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి టీవీఎస్ఎన్ నాగరాజు, ఎంఈఓ ఎం. శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఆక్రమణదారులకు నోటీసులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ బ్రాడీపేట బైపాస్‌రోడ్డులో ఆక్రమణదారులకు శుక్రవారం పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా రెండు రోజుల్లో ఆక్రమణలన్నీ తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో ప్రొక్లెయినర్‌తో ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మావుళ్లమ్మ దేవస్థానం ఆస్థాన వేద పండితుడు యావని వేంకటరామచంద్ర సోమయాజీ వేదం–జీవన నాదం పై ఆధ్యాత్మిక ప్రవచనం అందరినీ ఆకట్టుకుంది. ఉద్దరాజు ధర్మరాజు 38వ వర్ధంతి సందర్భంగా ఆనందరాజు ఫౌండేషన్ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, పైడిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రవచనం అనంతరం సోమయాజీను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీవీసత్యనారాయణ రాజు, యూకే విశ్వనాథరాజు, కారుమూరి బాబు తదితరులు పాల్గొన్నారు.